క్లుప్తంగా

పోలీస్ స్టేషన్‌లో టీడీపీ నాయకుల హల్‌చల్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ప్రలోభాలకు తెరతీసిన తెలుగుదేశం నాయకులు వైఎస్సార్ సీపీ కార్యకర్తను టీడీపీలో చేర్చుకుని వైఎస్సార్ సీపీ నాయకులు అతనిపై దాడి చేశారని ఆరోపణలు చేస్తూ హల్‌చల్ చేసిన సంఘటన కర్లపాలెం పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వైఎస్సార్ సీపీ కార్యకర్తను ప్రలోభ పెట్టి టీడీపీలో చేర్చుకోవటమే కాక ఇప్పటి వరకు వైఎస్సార్ సీపీలో ఉండి టీడీపీలోకి ఎందుకు చేరావని ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ నాయకులపై దాడి చేశారంటూ గణపవరం గ్రామానికి చెందిన కత్తి రాజేశ్వరరావు వైఎస్సార్ సీపీ నాయకులతో పాటు స్థానిక పోలీసులపై కర్లపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాపట్ల టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, పార్లమెంటు అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్, నాయకులు చీరాల గోవర్ధన రెడ్డి, అన్నం సతీష్ ప్రభాకర్, సలగల రాజశేఖర్‌లు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని రాజేశ్వరరావుపై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలంటూ హడావుడి చేశారు.

సీఎం జగన్‌తోనే రజకులకు న్యాయం

రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాటికలపూడి జయరాం

బాపట్ల: మే 13న జరిగే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు రజకులు ఓటు వేసి గెలిపించాలని రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పాటికలపూడి జయరాం పిలుపునిచ్చారు. శనివారం బాపట్ల పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారానికి వచ్చిన జయరాం స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అయితేనే రజకులకు రాజ్యాధికారం వస్తుందన్నారు. అధికారం కోసం చంద్రబాబు ఇచ్చిన హామీలను రజకులు నమ్మొద్దన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతి పక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించడం చంద్రబాబు సహజ లక్షణం అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబుకు ప్రజలకు చాలా చేయాలని కోరిక కలుగుతుందన్నారు. చంద్రబాబుకి అధికారం అప్పగిస్తే ఒక్క హామీ కూడా నెరవేర్చడన్నారు. చంద్రబాబు మాట మీద నిలబడే వ్యక్తి కాదని తెలుగుదేశం పార్టీలో ఉన్న రజకులందరికీ తెలుసన్నారు. 1985 నుంచి తెలుగుదేశం పార్టీ రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తానని ఊరిస్తున్నారని అన్నారు. ఈ 39 ఏళ్లలో తెలుగుదేశం ప్రభుత్వం రెండున్నర దశాబ్దాలు అధికారంలో ఉన్నా, రజకులకు మాత్రం ఎస్సీ హోదా రాలేదన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రజకులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024లో ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చాక జరిగే తొలి శాసన మండలి అభ్యర్థుల ఎంపికలో రజక సామాజిక వర్గానికి అవకాశం కల్పిస్తానని మాట ఇచ్చారన్నారు. జగనన్న కాలనీల పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిన కొత్త గ్రామాల్లోని కమ్యూనిటీ స్థలాల్లో రజకులకు దోబీ ఘాట్లు, లాండ్రీ షాపులు నిర్వహించుకునేందుకు స్థల కేటాయింపులు జరుగుతాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే, స్థిరమైన పాలనతో పాటు సుస్థిరమైన అభివృద్ధి ఉంటుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటి వద్దనే పొందిన రజకులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకునేందుకు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ఓటేస్తే.. ఉచితంగా కంటి పరీక్షలు

గుంటూరు మెడికల్: దేశంలో ప్రఖ్యాతిగాంచిన వాసన్ ఐ కేర్ సంస్థ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజలకు ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ఈ నెల 13 ఓటేసిన తర్వాత వేలికి ఉన్న ఇంక్‌ను తమ ఐ కేర్ సెంటర్‌లో చూపిస్తే ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. అంతేగాకుండా ఉచిత కంటి పరీక్షలు తర్వాత చేసే అవసరమైన సందర్భంలో చేసే చికిత్సకు, సర్జరీలకు కూడా ఆఫర్‌ను ప్రకటించింది. ఓటు వేసిన వారికి ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతో పాటుగా చికిత్సకు, సర్జరీ చేస్తే వాటిలో డిస్కౌంట్ ఆఫర్ ప్రకటించింది. చికిత్స, సర్జరీలకు విధించే చార్జీలలో పది శాతం వరకు తగ్గింపు అందిస్తామని ఆ సంస్థ తెలిపింది. ఈ ప్రత్యేక ఆఫర్‌ను ఈ నెల 13 నుంచి 25వ తేదీ వరకు వినియోగించుకోవచ్చునని వెల్లడించింది. ప్రజాస్వామ్యబద్ధంగా లభించిన ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో మరింత చైతన్యం, అవగాహన కలిగించేందుకు ఈ తరహా ప్రకటన చేసినట్లు వాసన్ ఐ కేర్ పేర్కొంది. గుంటూరు నగరంలో, కొత్తపేట శివాలయం ఎదురుగా ఉన్న వాసన్ ఐ కేర్ సెంటర్‌లో కంటి పరీక్షలు, ఆపరేషన్‌ల కోసం ఓటు వేసిన వారు సంప్రదించాలని పీఆర్వో వెంకట్రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

అబ్జర్వర్, ఐపీఎస్ అధికారి అయ్యప్పన్


భట్టిప్రోలులో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న అబ్జర్వర్, ఐపీఎస్ అధికారి అయ్యప్పన్

భట్టిప్రోలు: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ఓటర్లు సహకరించాలని అబ్జర్వర్, ఐపీఎస్ అధికారి అయ్యప్పన్ కోరారు. భట్టిప్రోలు విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రతా చర్యలు, విధుల నిర్వహణలో ఉంటున్న సిబ్బంది గూర్చి ఆరా తీశారు. విధులకు హాజరయ్యే వారికి కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు ముగిసేంత వరకు నిర్వహణలో సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈవీఎంలను బాపట్లకు తరలించే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు పటిష్ట చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

మెటీరియల్ పంపిణీకి సర్వం సిద్ధం

ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంతరాయుడు

ఎన్నికల నిర్వహణకు సంబంధించి మెటీరియల్ పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్లు వేమూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంతరాయుడు తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో ఉద్యోగులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. వసంతరాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలోని 233 పోలింగ్ కేంద్రాలకు సెక్టార్ల వారిగా మెటీరియల్‌ను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇందుకుగానూ 1500 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు మెటీరియల్‌ను పంపిణీ చేస్తామన్నారు. 8 గంటలకు మెటీరియల్‌ను తీసుకునేందుకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి

బాపట్ల: ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరు బాధ్యతతో పని చేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళసింగ్, ఖాజాన్ సింగ్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు సూక్ష్మ పరిశీలకులు, ప్రిసైడింగ్ అధికారులు, ఏపీవోలు, ఓపిఓలను నియమించే ప్రక్రియను వీరి సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా ర్యాండమైజేషన్ నిర్వహించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఆన్‌లైన్‌ద్వారా ర్యాండమైజేషన్ చేపట్టారు. బాపట్ల జిల్లాలోని 1,510 పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బందిని నియమించే ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి ప్రారంభించారు. 12న సంబంధిత పోలింగ్ సిబ్బందికి నియామక పత్రాలను డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఎన్ఐసి అధికారి సాగర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వర్తించాలి

జిల్లా ఎన్నికల పరిశీలకుడు కాజల్ సింగ్

రేపల్లె రూరల్: ప్రణాళికా బద్ధంగా పనిచేసి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల పరిశీలకుడు కాజల్ సింగ్ చెప్పారు. పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బందికి శనివారం నిర్వహించిన శిక్షణా తరగతులలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోలింగ్‌కు ఒక రోజు ముందుగానే సిబ్బంది పోలింగ్ సామాగ్రిని తీసుకుని కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలన్నారు. రాత్రికి ఆ పోలింగ్ కేంద్రంలోనే బస చేసి ఉదయం 7 గంటల సమయానికి పోలింగ్ తప్పనిసరిగా ప్రారంభమయ్యేలా చూసుకోవాలన్నారు. ముందుగానే ఈవీఎంలు పనిచేస్తున్నదీ లేనిదీ పరిశీలించుకోవాలన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో బసచేసే వారు రాజకీయ పార్టీ నాయకుల ప్రలోభాలకు తలొగ్గరాదన్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఈవీఎంలు, సామాగ్రిని భద్రపరిచి ఆ కేంద్రం పోలింగ్ అధికారి, రూట్ అధికారులకు అప్పజెప్పాలన్నారు. పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెలా షారోన్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న పరిమళసింగ్, ఖాజాన్‌సింగ్


స్ట్రాంగ్‌రూమ్ వద్ద ఎన్నికల మెటీరియల్‌ను సిద్ధం చేస్తున్న సిబ్బంది

ముగిసిన ఎన్నికల ప్రచారం

రేపల్లె రూరల్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రచారం చివరి రోజు శనివారం రేపల్లె పట్టణ, మండలంలో వాడవాడలా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు జోరుగా ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనా కాలంలో చేసిన పాలనా సంస్కరణలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రేపల్లె పట్టణంలోని జగనన్న కాలనీలో నాయీ బ్రాహ్మణ నాయకులు, మండలంలోని రుద్రవరం గ్రామంలో ఎంపీటీసీ మేడికొండ అనిల్‌లు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్‌లను గెలిపించేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సాయంత్రం 6 గంటల నుంచి ఎన్నికల ప్రచారాన్ని నిలుపుదల చేశారు.


రుద్రవరంలో ఎన్నికల ప్రచారం


రేపల్లె పట్టణం జగనన్న కాలనీలో ప్రచారం

అమృతలూరులో ఇంటింటా ప్రచారం

అమృతలూరు(భట్టిప్రోలు): వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వరికూటి అశోక్‌బాబు, నందిగం సురేష్‌ల విజయం కోరుతూ స్థానిక నాయకులు ఇంటింటా ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. అమృతలూరులో వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు ఇమామ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ప్రజలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అవ్వాతాతల వద్దకు వెళ్లి వారితో ఆప్యాయంగా మాట్లాడారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు.

సమగ్ర వికాసంతో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్


మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యార్థులు సమగ్ర వికాసంతో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ అన్నారు. శనివారం జేకేసీ కళాశాల 56వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ కృపాసాగర్ మాట్లాడుతూ మనిషి సమగ్ర వికాసానికి విద్య దోహదం చేస్తుందన్న స్పృహతో ఐదున్నర దశాబ్దాలకు పూర్వమే జాగర్లమూడి కుప్పుస్వామి స్ఫూర్తితో నెలకొల్పిన జేకేసీ కళాశాల ఖ్యాతి విస్తరించటం అభినందనీయమని అన్నారు. అనంతంగా విస్తరించిన విద్యా, జ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదగాలని సూచించారు. ర్యాంకులు, మార్కులతో కాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్, కరెంట్ అఫైర్స్, కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు శారీరక, మానసిక వికాసానికి దోహదపడే క్రీడలు, పోటీ పరీక్షలపై ఆసక్తి కనబర్చాలన్నారు. తొలుత కళాశాల మూల స్తంభాలైన జాగర్లమూడి చంద్రమౌళి, జాగర్లమూడి నరేంద్రనాథ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ మాట్లాడుతూ కళాశాల ఆడిటోరియాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కళాశాల పాలక మండలి అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ జేకేసీ కళాశాల గత 10 ఏళ్లుగా యూజీసీ ఏ గ్రేడ్ గుర్తింపు పొందుతూ విద్యా ప్రమాణాల స్థాయిని నిలబెడుతోందని అన్నారు. కార్యక్రమంలో పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంటూరి నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ పరుచూరి గోపీచంద్ పాల్గొన్నారు.

మద్యం అక్రమ సరఫరాను అరికట్టాలి

సెబ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్‌రాజు


సమావేశంలో సూచనలిస్తున్న హేమంత్ రాజు

రేపల్లె రూరల్: అక్రమ మద్యం సరఫరాను అరికట్టాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ కే.హేమంత్‌రాజు అన్నారు. సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల కమిషనర్, సెబ్ కమిషనర్‌ల ఆదేశాల మేరకు పట్టణంలోని సెబ్ కార్యాలయానికి శనివారం వచ్చారు. స్థానిక కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీరంలో అక్రమంగా మద్యం సరఫరా కాకుండా సెబ్ సిబ్బంది ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సెబ్ కార్యాలయ పరిధిలో ఎక్కడైనా అక్రమంగా మద్యం నిల్వలు ఉంచినా నేరమేనని అన్నారు. ఈ చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎన్నికల సందర్భంగా ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో దర్జీలకు న్యాయం

భట్టిప్రోలు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మాత్రమే దర్జీల సంక్షేమం కోసం ఆలోచించారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు డాక్టర్ చిలుమూరి రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని పెదలంక, చింతమోటు, పెసర్లంక గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ అధికార పగ్గాలు చేపట్టిన తరువాత జగనన్న చేదోడు పథకం ద్వారా ఇచ్చిన మాట ప్రకారం దర్జీల ఖాతాల్లో రూ.10 వేలు ప్రతి ఏటా జమ చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వరికూటి అశోక్‌బాబు, నందిగం సురేష్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.ప్రసాద్, ప్రశాంత్, నరేష్, ప్రభుదాసు, రాజు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.


పెదలంకలో మహిళా దర్జీని ఓటు అభ్యర్థిస్తున్న రామ్మోహన్‌రావు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

వేజండ్ల(చేబ్రోలు): రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో వృద్ధుడు మృతి చెందటంతో పాటు మరొకరు గాయపడ్డారు. చేబ్రోలు మండలం వేజండ్ల అడ్డరోడ్డు వద్ద శనివారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వేజండ్ల గ్రామానికి చెందిన పఠాన్ దాదాఖాన్ (78) మరో వ్యక్తితో కలిసి నారాకోడూరు వైపు నుంచి వేజండ్లకు వస్తున్నారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ వీరిని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన దాదాఖాన్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మరణించాడు. మరో బైక్‌పై ఉన్న రూపేష్‌కు గాయాలవటంతో సమీపంలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబు మాయ మాటలు జనం నమ్మరు

వైఎస్సార్ సీపీ వేమూరు అసెంబ్లీ అభ్యర్థి అశోక్‌బాబు


ఇంటూరు ఎన్నికల ప్రచారంలో వరికూటి అశోక్‌బాబు

ఇంటూరు(వేమూరు): చంద్రబాబు ఆరాటం కేవలం సీఎం కుర్చీ కోసమే తప్ప ప్రజల కోసం కాదని వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు అన్నారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలని చంద్రబాబు కుతంత్రాలకు తెర తీశారని ఆరోపించారు. బాబుకు ఓటేస్తే రాష్ట్రంలో కరువు విలయ తాండవం చేస్తుందని హెచ్చరించారు. ప్రజలకు మంచి జరిగితే బాబుకు గిట్టదని, ఎదిరించిన వారిపై దాడులు చేయించడమే ఆయన నైజమని ఆరోపించారు. పేద ప్రజల సొమ్మును పెత్తందార్లకు దోచిపెట్టేందుకు ఉబలాట పడుతున్నారని అన్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివక్ష లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. అదే విధంగా రాబోయే కాలంలో సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరికూటి లక్ష్మి, గాదె శివరామ కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ దేవమణి, వీరభద్ర శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ఆనంద్‌కుమారి, బొట్టు మోషే, గుమ్మడి రవి రాజా, భీమవరపు శ్రీనివాస్‌రెడ్డి, అవుతు ముత్తరెడ్డి, షేక్ సుభాని, ఇంటూరు ఆంజనేయులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు

ఆలపాడు(వేమూరు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి వైఎస్సార్ సీపీలో చేరడం జరిగిందని గ్రామ సర్పంచ్ చేబ్రోలు సంపత్‌కుమార్ తెలిపారు. చుండూరు మండలంలోని ఆలపాడు గ్రామానికి చెందిన జనసేన గ్రామ సర్పంచ్ చేబ్రోలు సంపత్ కుమార్ జనసేన పార్టీకి రాజీనామా చేశారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సమక్షంలో శనివారం పార్టీలో చేరారు.తనతో పాటు 100 కుటుంబాలను వైఎస్సార్ సీపీలో చేర్చారు. వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ జనసేన, తెలుగుదేశం పార్టీకి చెందిన వారు వైఎస్సార్ సీపీలో చేరితే వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జనసేన పార్టీకి చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆలపాడుకు చెందిన జనసేన కార్యకర్తలతో వరికూటి అశోక్‌బాబు

గ్రామాల్లో ఉత్సాహంగా ప్రచారాలు

భట్టిప్రోలు: ఎన్నికల ప్రచారానికి ఆఖరి రోజు కావడంతో ప్రధానపార్టీలతో సహా చిన్నా, చితకా పార్టీలు ప్రజలను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా వైఎస్సార్ సీపీ, కూటమి అభ్యర్థుల అభిమానులు, శ్రేణులు పగలనక, రాత్రనక ఇంటింటికీ తిరుగుతూనే ఉన్నారు. భట్టిప్రోలుతో పాటు గ్రామాల్లో కార్యకర్తలతో కలసి నాయకులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వరికూటి అశోక్‌బాబు, నందిగం సురేష్ లను గెలిపించాలని ప్రజలను అభ్యర్థిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విన్నవిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ భట్టిప్రోలు మండల సోషల్ మీడియా కన్వీనర్ రెబ్బా మున్ని, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్దిశెట్టి వెంకటేశ్వరరావు, యేపూరి నాగు, పంతగాని బాలసుబ్రహ్మణ్యం, కనపర్తి నాగయ్య తదితరులు పాల్గొన్నారు. భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, మాతంగి రవీంద్ర, దావూరి నాగమల్లేశ్వరరావు, గోలి శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ఐలవరంలో వైఎస్సార్ వీరాభిమాని మాచర్ల వీరేంద్ర దంపతులు ఇంటింటికి తిరిగి ఈవీఎం నమూనా బ్యాలెట్‌ను చూపి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓట్లు అభ్యర్థిస్తున్నారు.


ఆళ్లమూడిలో ఎన్నికల ప్రచారం


భట్టిప్రోలులో టీ స్టాల్ నిర్వాహకుడికి కరపత్రాలు అందజేస్తున్న లలిత కుమారి

జగన్ మామకోసం మేము సైతం


ఐలవరంలో జగన్ మామ కోసం మేముసైతం అంటూ ప్రచారంలో చిన్నారులు

ఐలవరం ప్రచారంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చిన్నారులు

ఐలవరం(భట్టిప్రోలు): వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం భట్టిప్రోలు మండలం ఐలవరంలో జగన్ మామ కోసం మేము సైతం అంటూ చిన్నారులు రిబ్బన్లు కట్టుకుని, జెండాలు, బ్యానర్లు చేతబూని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇంటింటికీ తిరిగి జగన్ మామకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే అభ్యర్థి సోదరుడు డాక్టర్ వరికూటి అమృతపాణి మాట్లాడుతూ పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటేనే పేదలకు పథకాలు మరింత గొప్పగా అందుతాయని అన్నారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వరికూటి అశోక్‌బాబు, నందిగం సురేష్‌లను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, పార్టీ కన్వీనర్ ఎం.తులసి రంగయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మాచర్ల వీరేంద్ర, జొన్నాదుల శరత్, బట్టు బసవయ్య, మాచర్ల హేమసుందరరావు, గడ్డం శ్రీనివాసరావు, దీపాల తేజ, మహ్మద్ రఫీ, కర్రా కిషోర్, సంగాబత్తుని వెంకటేశ్వర్లు, గట్టు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన అయోధ్య రామ ఉత్సవ్-2024

నగరంపాలెం: భరతముని కూచిపూడి నృత్య కళాక్షేత్రం నిర్వహణలో సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్ సౌజన్యంతో బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలోని పద్మావతి, అన్నమయ్య కళ్యాణ వేదికలపై నిర్వహిస్తోన్న అయోధ్య రామ ఉత్సవ్-2024 రామ్‌లల్లా పురస్కార నృత్యోత్సవం శనివారంతో ముగిశాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన నృత్యోత్సవాన్ని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నాట్యాచార్యులు, వందల మంది శిష్యులు రాకతో వేదిక వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఆర్‌వీఆర్/జేసీ కళాశాల ఆచార్యులు డాక్టర్ మద్దినేని సుధాకర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు చెందిన నాట్యాచారులు, వారి శిష్యులను రెండు వేదికలపై నృత్య ప్రదర్శనలు యిప్పించడం అభినందనీయమని అన్నారు. ప్రముఖ నాట్యాచారిణి వి.రంగమణి అధ్యక్షత వహించగా, సేవ్ కూచిపూడి వ్యవస్థాపకులు భావన పెద్దప్రోలు, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, విద్యావేత్త ఎస్.తిరుపతయ్య, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ వై.షేక్, నాట్యాచారులు ఘంటసాల పవన్ కుమార్, వెంకటేశ్వర్లు, పలువురు నాట్యాచారులు పాల్గొన్నారు. అనంతరం నిర్వాకురాలు రంగమణి దంపతులను సత్కరించగా, గురువులు, చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలు, జ్ఞాపికలు అందించారు.


ధ్రువీకరణ పత్రాలతో నృత్యకారిణిలు

శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానము, టుప్పుపేట, మచిలీపట్నం

కౌలు బహిరంగ వేలం పాటలు

శ్రీ స్వామివారి దేవస్థానము యొక్క ఈ దిగువ తెలిపిన బాపట్ల జిల్లాలోని భూములకు బహిరంగ వేలము పాటలో లీజుకు ఇవ్వబడును.

వ. సం.	భూమి ఉన్న గ్రామము	విస్తీర్ణము ఎ. సెం.	ఎళ్ల సంఖ్య	భూమి స్వభావము	లీజు కాల పరిమితి	వేలం పాట జరుగు తేదీలు	[illegible]
1.	[illegible], రేపల్లె మం.	49.49	8	మాగాణి	2024-25 to 2026-27	14.06.2024; 11.00AM	[illegible] తేది 01.07.24 నుండి
2.	కొప్పురివారి పాలెం నిజాంపట్నం మం.	22.75	5	మాగాణి		14.06.2024; 3.00 PM	
3.	నగరం గ్రామం మం.	9.75	1	మాగాణి		17.06.2024; 11.00 AM	
4.	రాజోలు, చెరుకుపల్లి మం.	25.88	3	[illegible]		17.06.2024; 02.00.PM	
5.	అల్లూరు గ్రామము, పిట్టలవానిపాలెం మం.	7.40		మెట్ట		17.06.2024; 04.00.PM	
6.	[illegible] నిజాంపట్నం మం.	15.01	1	మాగాణి		19.06.2024;11.00 AM	
7.	[illegible], నిజాంపట్నం మం.	25.70	4	మాగాణి		19.06.2024;03.00 PM	
8.	[illegible], నగరం మం.	26.01	16	మాగాణి/మెట్ట		21.06.2024; 11.00 AM	

[illegible]

ఇట్లు, N.S. [illegible], కార్యనిర్వహణాధికారి. ఫోన్ నెం.[illegible]7111.